# రుషీకేష్‌రాయి

నేను తొలిసారి రుషీకేష్ కుటుంబంతో వెళ్ళినప్పుడు, గంగానది యిసుక తిన్నెకు అనుకొని వున్న యీ రాయిని తేడానికి కారణాలు రెండు. ఒకటి ఢిల్లీలో నా ఆఫీసు పెద్ద ప్రాణనాథ్ జోషి దినచర్య జ్ఞప్తికి రావటం. రెండోది యెవరో రుషి పుంగవుడు అహోరాత్రాలు గంగ ఒడ్డున తప్పస్సు చేసి ఆ స్వచ్ఛమైన నీలి నీటితో ప్రక్షాళనలమై, యీ రాయిగా మారాడన్న క్షణికమైన పిచ్చివూహ.

రాయి తొక్క వొలిచి నిలువుగా కోసిన గుడ్డు ఆకారంలో వుంది. నా తెరచిన అరచేయి దానిమీద మోపితే సరిగ్గా సరిపోయింది. చలువరాయి తెలుపు నునుపు లేకపోయినా, దీని అందం దీనికుంది. ఇంచుమించు రెండు కేజీలపైనే బరువుంటుంది.

ఢిల్లీలో యింటికి వచ్చాక, నా రైటింగు టేబిలు మీద పెట్టిన రాయి మాయమైపోయింది. స్కూల్లో అప్పటికే పెయింటింగ్‌లో బహుమతి పొందిన మా అమ్మాయి ఉష యీ రాయి నునువుగా వున్న వేపు యిండియన్ యింకుతో అప్పటికే ఒక లాండ్ స్కేప్ వేసింది. అచ్చంగా రుషీకేష్‌లో లక్ష్మణ్ ఝూలా మీద నిల్చొని ఉత్తర వేపు హిమాలయపు పుంత నించి తోసుక వస్తున్న గంగానది యిరు వేపుల ఒడ్డుల వున్న యెత్తయిన చెట్లు. ఈ రాయిని తిరిగి నా రైటింగ్ టేబిలు మీద పెట్టినా, పెయింటింగు అద్భుతంగా కనిపించడం వలన మా డ్రాయింగు రూమ్‌లో నలుగురికీ కనిపించేటట్లు పెట్టాం. వచ్చిన వాళ్ళతో అడిగినా అడక్కపోయినా సగర్వంగా మా అమ్మాయి పెయింట్ చేసిందని చెప్పేవాళ్లం.

అమ్మాయి వయసులో పెరిగి, పెయింటర్‌గా బాగా యెదిగి పేరు తెచ్చుకునే సరికి యీ రాతి మీద గీచిన బొమ్మ ప్రాధాన్యం తగ్గిపోయింది. అమ్మాయికి పెళ్లయి వెళ్లాక యీ రాయి మీద ధూళి పడి యీ బొమ్మ కూడ పేలవంగా మారింది.

ఢిల్లీ నించి విశాఖపట్నం బదిలీ మీద వచ్చేసరికి యింట్లో యిద్దరమే. ఎవరో అతిథులు వచ్చివెళ్లినా యేంటో వెలితిగానే వుండేది. నిత్యం యెవరో చిన్న పిల్లో-పిల్లాడో దగ్గర వుండి అల్లరి చేస్తే బాగా వుండేదనిపించేది. ఎవరు స్వంతపిల్లల ఆనందాన్ని వదలుకోగలరు? పోనీ అమ్మాయి కడుపు పడినా ఆ బిడ్డను తెచ్చి వుంచేవాళ్లం. అలాంటప్పుడు రాత్రుళ్లు యింట్లో యెవరో కదులుతున్న శబ్దం వినిపించినా కొద్ది రోజులు పట్టింపు చేసుకోలేదు. ఒకనాడు డ్రాయింగు రూములో

'దివానా'ను కదపగా ఆ సందులో నించికంపు గుప్పున వచ్చింది. చూడగా యిదంతా చుంచు మహత్యం అనిపించింది. ఫినాయిలు వేసి కడిగినా యింకా ఆ మచ్చలు, కంపు వున్నట్లే వుంది.

ఇదివరకు యీ బంగళాలో వున్నవాడు యింట్లోకి పాము వచ్చిందని నీరు వెలుపలికి వెళ్లే మార్గాలన్నీ మూయించేసాడు కదా, యీ చుంచు యింట్లోకి యెలా వచ్చిందో కనుక్కుందామని ఆ రాత్రి తెలివేసి వున్నాం. వంట యింట్లో సిమ్మెంటుతో ఒక మూలకున్న "సింక్" కుళ్లు నీరు వెలుపలకెళ్లే కన్నం ద్వారా బయట నించి ప్రవేశించి గేస్ స్టౌవున్న దిమ్మ మీదికి ప్రాకి కిందికి దిగి డ్రాయింగ్ రూమ్ గోడ ప్రక్క నించే దివానా వేపు కదిలింది. దానిని తరిమి బయటకు పంపించి కన్నంలో ఒక దళసరి గుడ్డను చుట్టపెట్టి పెట్టాం. తెల్లారేసరికి ఆ గుడ్డ "సింకు"లో ప్రక్కన పడివుంది. రెండో రోజు రాత్రి యింకో రాయి పెట్టే అదీ తోసుకుని వచ్చింది. మూడో రాత్రి మా ఆవిడ చప్పున రిషీకేష్ రాయిని 'సింకు'లో కన్నానికి అడ్డుగా పెట్టగానే నాకు 'తమ తమ నెలవులు' పద్యం జ్ఞప్తికి వచ్చింది. గంగానది – పవిత్ర జలాల్లో నిత్యం యీదే యీ రుషి పుంగవుడు యీ 'సింకు' కంపులో నిత్యం పడేదానికి కారకుడ్ని నేను. ఎంతో పాపం చేస్తున్నాననిపించి –

"ఆ రాయినెందుకు పాడు చేస్తావ్?" అన్నాను.

"పాడా? దీని మీద బొమ్మ చూడండి– చెరిగే పోయింది. ఇలాగైనా కాస్త దీన్ని వుపయోగించుకోనియ్యండి"అని నా విన్నపాన్ని నా యిల్లాలు త్రోసిపుచ్చింది.

ఆ రాత్రి తన తెలివితేటలను నిరూపించుకోడానికి నన్ను లేపి, చేతిలో టార్చి లైటు పట్టుకుని "నాతో ఒకసారి వస్తారూ?" అంది. మాటాడకుండా వెంటపడ్డాను. చప్పుడు కాకుండా వంట యిల్లు పెరటి ద్వారం తెరిచి బయట నించి 'సింకు' ద్వారంలోనికి వెలిగిన టార్చిలైటు వెలుతురు త్రిప్పింది. చుంచు రెండు కళ్ళు మెరుస్తున్నాయి.

"చూసారా, మీ రిషీకేష్‌రాయి బలం?"

"ఇంకేదైనా రాయి పెట్టే సరిపోయేది."

"ఏం? ఏ రాయి అయితే యేమిటి? రాయి రాయే. ఇదేం శిల్పమా?"

ఆ మిలమిలా మెరిసే రెండు కళ్లూ ఆ రిషి పుంగవునివే అనిపించాయి. రిషీకేష్‌లో గంగ సంగీతపు మెట్లు నొక్కి పారుతున్న స్వరాలు వినిపిస్తున్నాయి. ఆ గంగా జలంలో నిత్య మునిగి తన నెత్తి మీదను ప్రక్కగా యీదుతున్న యే కీటకాలకూ, చేపలకూ యెటువంటి హాని చెయ్యని యీ రాయిని మురికితో నల్లబడి నిత్యం కంపుకొట్టున్న 'సింకు' లోకి విసిరేసానే అన్న బాధతో ఆ రాత్రి నాకు సరిగ్గా నిద్దరపట్టలేదు.

ఒక విధమైన మనో నిబ్బరం తెచ్చుకోడానికి చేసిన ప్రయత్నంలో "ఈ రాయి దొరికిన చోట గంగలో కలిసే మురికి కాలవలు, అడుక్కునే వాళ్లు, రోగులు, మోసగాళ్ళు తెలుసుకోవాలన్న తపనలేని సోమరుల మయం. తపస్సు చేసి మానవుడ్ని మానవాతీతునిగా మార్చగలిగే అతీతమైన యింద్రియ జ్ఞానాన్ని ప్రసాదించే ఋషులు యిప్పుడు అక్కడ లేరు. ఎలాగూ యీ రాయి అక్కడ నించి హరిద్వారం వేపు

కదిలి చివరకు కలుషితమైన గంగానదీ జలాల్లో కొన్నాళ్లకు కొట్టుకొనిపోయేదే. దాని బదులు పూర్వ జన్మలో చేసుకున్న పాప ఫలితాన్ని యీ ఋషి పుంగవుడు రాయి రూపంతో నా యింట్లో కంపు సింక్‌తో అనుభవిస్తున్నాడు."

నా మనసును యిలాంటి ఆలోచనలతో కుదుటపర్చుకుంటూన్న సమయంలో ఒక అఘాయిత్యం జరిగింది. ఆవేళ ఆదివారం. అలస్యంగా లేచి హాయిగా గడుపుదామంటే ముందుగా వేసిన మా ఆవిడ కేక వినిపించింది. వంటయింట్లోకి పరుగున వెళ్తే మా ఆవిడ సింకు వేపు చూపిస్తోంది. ఏ పాము అందులో చొరబడిందోని చూస్తే రుషీకేష్‌రాయి పడివుంది.

"ఆ రాయి యెత్తండి" అంది పణుకుతూ.

ఎత్తితే కనిపించింది పెద్ద బొద్దంకి. చచ్చిపడివుంది.

"అవతల పారెయ్యండి" – ఆవిడ అజ్ఞ.

ఎత్తి అవతల కాలవదగ్గర పారేసినా నా మనసులో "ఇంకేరాయి దొరకనట్లు దీనితోనే ఆ ఖూనీ చెయ్యాలా?" మనసులో యీ మాట దాచుకోలేక అంటే ఆవిడ ఛర్రుమంటూ – "ఈ ఒక్క ప్రాణి బతికితే వారం రోజుల్లో యింట్లంతా బొద్దంకుల మయం అవుతుంది. ఇటువంటి బలమైన పనికొచ్చిన రాయిని రుషికేష్‌నించి తెచ్చినందుకు మిమ్మల్ని మెచ్చుకోవలసిందే" అంది.

ఆవేళ ఉదయం కాఫీ త్రాగగానే ప్రాణనాథ్ జోషి జ్ఞప్తికి వచ్చాడు. ఆ వేళ మా యిద్దరి మధ్యా ఆఫీసులో జరిగిన సంభాషణ అంతా తలలో తిరిగి యీ పరిస్థితిని చూసి పిచ్చెక్కినట్లయింది. బొద్దంకిని చంపినరాయి, చుంచును చంపలేదా? విషం లేని పాము తల కూడా పిప్పయిపోతుంది. ఆకలికి తట్టుకోలేక యింకోలా సంపాదించుకోలేని యే దొంగ యింట్లో చొరబడ్డా యీవేళలానే గాబరగా ఆ మనిషి మీద కూడా యీ రాయి విసిరేవచ్చు. అప్పుడు ఖూనీ కావచ్చు. అత్మరక్షణ కిచ్చిన అయుధం ఆవేశంతోనో, భయంతోనో ఖూనీకి వుపయోగించటం లేదా కొందరు?

"ఈసారి ఆ రాయి యే ప్రాణిమీదా విసరకు!" అన్నాను మా ఆవిడతో.

"ఏం?" అంది మోటుగా.

"యుగయుగాల నించి ఆ రాయి హిమాలయాల యెత్తున మెసలింది."

"ఆ యెత్తు నించి దిగజారి అరిగిపోయింది కదా! అబ్బబ్బా! ప్రాణం లేని రాయిని గురించి యెందుకో మీ మదిలో ఆ కలవరం?" కవిత్వ ధోరణిలో వెటకారం చేస్తూ "రండి" అంటూ నా చెయ్యి పట్టుకొని కాలవ దగ్గరకు తీసుకవెళ్లి –

"చూడండి! నేను భయాన్నో నయాన్నో దగ్గరలో వున్న ఆ రాయి యెత్తకపోతే ఆ బొద్దంకి చచ్చేదా? ఆ బొద్దంకి చావకపోతే యిన్ని చీమలు యీవేళ ఆకలితో మాడేవికదా!" అంటూ చచ్చిన బొద్దంకి చుట్టూ చేరి దాని మోసుకపోతున్న చీమల సమూహాన్ని చూపించింది.

ఓడిపోయిన వాడిలా మాటాడకుండా నా గదిలోకి వచ్చాను. చావకుండా బ్రతికి వుండడానికి, యీ లోకంలో ప్రతి నిత్యం బలవంతులు బలహీనులను చేసే ఖూనీలకు చట్టం సమ్మతిస్తుంది సుమా అన్నట్లు మా ఆవిడ తన ఖూనీని సమర్థించుకుంది. నేను యిలాంటివెన్నో విన్నాను. కన్నాను. మనసు కుదుటపరచుకునేవాడ్నే. కానీ మనసులో ప్రాణనాథ్ జోషి యింకా తిరుగుతున్నాడు. ఆ రాత్రి పరువు మీద

పడినా అతను నా గదిలోనే వున్నట్లు అనిపించింది. నిజానికి నా గది ఢిల్లీలో అతని ఆఫీసు గదిగా మారినట్లు అనిపించింది. జోషి నాకన్నా ఓ పదేళ్లు వయసులో పెద్ద. నేను అతని క్రింద ఆఫీసరుగా బదిలీ మీద వెళ్ళినప్పుడు ఒక వింతను గమనించాను. తన ఆఫీసు కేబిన్‌లోనికి రాగానే బీరువాలోని ఒక రాయిని తీసి ఆఫీసు టేబిలు మీద నిలబెట్టి తనతో తెచ్చిన ఒక పువ్వు ఆ రాయి ముందర పెట్టి చేతులు జోడించాడు. అంత పెద్ద చదువు చదివి యింత పెద్ద వుద్యోగం చేస్తున్న వాడికి, యీ ఛాందసం యేమిటనుకున్నాను. నిజానికి కొందరి మిత్రులతో యీ ఘట్టం చెప్పి జోషిని అపహాస్యం పాలు చేసాను.

ఒక రోజు ప్రార్థన చేసిన వెంటనే నన్ను పిలిపించాడు.

"అండర్ సెక్రటరీ గోయల్ దగ్గరకు తీసుక వెళ్లావే ఆ ఫైల్ మీద ఆర్డర్స్ పడ్డాయా?" అడిగాడు.

"అయ్యా! ఆ ఫైలు మన ఆఫీసునించి కదలి సరిగ్గా వారం రోజులైంది. అప్పుడే...."

ఇంకా నానోటి మాటలు పూర్తి కాలేదు.

"ఆ ఫైలుకు ప్రాణం లేదు. నీకున్నది. ఫైలు పట్టుకుని నువ్వు కదిలితే గానీ అంతమందికి మేలును కూర్చే ఆ పథకం తుప్పు పట్టిపోతుంది."

నేను అతని ఎదరగా వున్న రాయివేపు రాతి బొమ్మలా నిల్చొని చూస్తుంటే.

"ఈరాయి, రిషీకేష్ నించి తెచ్చాను. స్వచ్ఛమైన గంగాజలాలలో నిత్యం స్నానం చేసిన రాయి. నేను తిన్నదీ, తాగేదీ, పీల్చేగాలీ, నీతి, నిజాయితీ అంతా కలుషితమైన వాతావరణంలో బ్రతుకుతున్నాను. స్వచ్ఛమైన వాతావరణంలో వెలసిన యీ రాయి, నాకు దైవానికి ప్రతి. ఈ దైవం నాదగ్గరకు రాదు. ప్రాణం గల నేనే దైవం దగ్గరకు వెళ్తే. నేను స్వచ్ఛమైన మనసుతో భయం భీతి లేకండా నా విధిని నిర్వర్తించడానికి తగ్గ బలాన్ని సమకూర్చుకుంటాను. నలుగురికి మేలుచేసే ఆ ఫైలు నాకు దైవం. నివ్వు దానిపై భక్తి భావంతో మెసలకపోతే ఫలితం శూన్యం – నీ చేతకాదంటే చెప్పు– నేనే వెళ్తాను" అన్నాడు.

ఆ దృశ్యం అంతా ఆ రాత్రి కళ్లకు కట్టడం వల్ల ఒక నిర్ధారణకు వచ్చాను.

ఈసారి ఢిల్లీ టెంపరరీ డ్యూటీ మీద వెళ్లినప్పుడు మా ఆవిడకు చెప్పకుండా యిల్లు కదిలే కొద్ది క్షణాల ముందు సింక్‌లోని రిషీకేష్‌రాయిని దాచేసి. నా సఫారి సూట్ కేస్‌లో పెట్టేసాను. ఢిల్లీ నించి రుషీకేష్ వెళ్లి గంగాజలాల్లో రాయిని బాగా కడిగేసి, యే ప్రదేశం నించి దాన్ని తెచ్చానో ఆ ప్రదేశానికి వెళ్లి అక్కడ యిసుక తిన్నెమీద రాయిని పెట్టి, పూలతో పూజించి –

"ఓ దైవ స్వరూపుడైన రుషిపుంగవా! మేము మా సుఖాలకోసం నీకు మసిపూసి, రక్తం మరకలను తగిలించి హీనం చేసాం. ఈ అపరాధాల్ని క్షమించు" అంటూ స్వచ్ఛమైన గంగాజలంలో ముడుకులలోతు వరకు దిగి ఆ రాయిని విడిచిపెట్టాను.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 26-2-88: 4-3-88)

(హిందీ అనువాదం: భారతీయ జ్ఞానపీఠ్‌వారి నా కథల సంపుటిలో)

***